శాస్త్రోక్తంగా సత్యనారాయణస్వామి వ్రతం

నెల్లూరు(బృందావనం) : మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో బుధవారం ఉదయం భక్తులచే సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. సాయంత్రం అమ్మవారికి ఊంజల్‌సేవ గావించారు. ఆలయ ప్రధానార్చకుడు రఘురామమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల్లో భక్తులు విశేషంగా పాల్గొని అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. దేవస్థానం ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

• రంగనాయకులపేట గోపురంవీధిలోని ఉత్తరాది మఠం ధన్వంతరి ఆంజనేయస్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాన్ని భక్తిప్రపత్తులతో నిర్వహించారు. భీమసేనాచార్ ఆధ్వర్యంలో శ్రీవైభవ్, రాఘవేంద్రగోపిస్వామి, రఘుస్వామి వ్రతాన్ని జరిపించారు. భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



విశేషాలంకరణలో సత్యనారాయణస్వామి



సామూహిక వ్రతంలో భక్తులు



వ్రతం ఆచరిస్తున్న భక్తురాలు

నేత్రపర్వం.. గరుడోత్సవం

నెల్లూరు(బృందావనం) : రంగనాయకులపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో బుధవారం ఉదయం స్వామివార్లకు తిరుమంజనం, సాయంత్రం బంగారు గరుడ వాహనసేవ నిర్వహించారు. దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీని వాసులు, ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

• బాలాజీనగర్‌లో వికాస్ ప్రజాహిత సేవా సమితి ఆధ్వర్యంలో గరుడ వాహనంపై వెంకటేశ్వరస్వామి ఊరేగింపు బుధవారం వైభవంగా నిర్వహించారు. స్థానిక సీతారామస్వామి మందిరం నుంచి పద్మావతి నగర్, ద్వారకామయి నగర్ మెయిన్ వీధి, అద్దాల సాయిబాబా మందిరం, శ్రీనగర్, ఏసీ నగర్ తదితర ప్రాంతాల మీదుగా ఊరేగింపు వైభవంగా సాగింది. సర్వాలంకార శోభితంగా కొలువైన స్వామివారిని భక్తులు దర్శించుకొని ప్రణమిల్లారు. వికాస్ ప్రజాహిత సేవా సమితి అధ్యక్షుడు కర్తం ప్రతాప్‌రెడ్డి–జ్యోతి దంపతులు, మందిర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు తన్నీరు మస్తాన్‌రావు, సోమిశెట్టి వెంకటరత్నం, గౌరవాధ్యక్షుడు తాతా కిశోర్, కోశాధికారి కొప్పరపు శివప్రసాద్ పాల్గొన్నారు.



గరుడ వాహనంపై వేంకటేశ్వరస్వామి



తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో..

భక్తిశ్రద్ధలతో చండీ హోమం



నెల్లూరు(బృందావనం) : మూలాపేటలోని శంకరమఠంలో మాఘ పౌర్ణమి సందర్భంగా బుధవారం చండీహోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కంచికామకోటి పీఠానికి చెందిన వేదపండితులతో నిర్వహించిన చండీహోమంలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. ఉభయకర్తలుగా ఆమంచర్ల ప్రభాకర్‌రావు దంపతులు వ్యవహరించారు. మఠం నిర్వాహకులు కొర్రపాటి నందకిశోర్, ఉషాకుమారి పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైఎస్ జగన్‌ను కలిసిన ఎమ్మెల్సీ



జగన్‌మోహన్‌రెడ్డితో పర్వతరెడ్డి, ఊటుకూరు

నెల్లూరు(బారకాసు) : వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ, పార్టీ సిటీ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం 13వ డివిజన్ కార్పొరేటర్, పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఊటుకూరు నాగార్జునను వైఎస్ జగన్‌కు పరిచయం చేశారు.

హెచ్చరిక బోర్డు ఏర్పాటు



సాక్షి ఎఫెక్ట్..

నెల్లూరు(బారకాసు) : 'అపరిశుభ్రంగా ఖాళీ స్థలాలు' అనే శీర్షికన ఈనెల 10న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. నగరంలోని సరస్వతినగర్‌లో ఉన్న ఖాళీ స్థలం ముందు పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామనే హెచ్చరిక బోర్డును బుధవారం ఏర్పాటు చేశారు.

సభ్యత్వ నమోదు చేసుకోవాలి

నెల్లూరు(బృందావనం) : ఏపీ ప్రభుత్వ విశ్రాంత డ్రైవర్ల సంఘంలో సభ్యత్వ నమోదు చేసుకోవాలని సంఘ జిల్లా అధ్యక్షుడు షేక్.కాలేషా కోరారు. ఈ మేరకు నగరంలోని పెన్షనర్స్ అసోసియేషన్ భవనంలో బుధవారం ఆయన మాట్లాడారు. ఉద్యోగ విరమణ చేసిన డ్రైవర్ల సంక్షేమం కోసం రాష్ట్ర, జిల్లా స్థాయిలో పెన్షనర్ల సంఘం నాయకులు, రాష్ట్ర ప్రభుత్వ నాన్‌గెజిటెడ్ ఉద్యోగుల సంఘం నాయకుల సహాయ సహకారాలతో విశ్రాంత డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను విన్నవించుకుంటామని వివరించారు. విశ్రాంత ప్రభుత్వ డ్రైవర్లు తమ పేరు, ఫోన్ నంబర్‌ను తప్పనిసరిగా పంపాలన్నారు. పూర్తి వివరాల కోసం 94932 35395 నంబరును సంప్రదించాలని కోరారు.

హైరిస్క్ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

ఇందుకూరుపేట : ఇటుక బట్టీలు, రొయ్యలు, చేపల చెరువులు, ఆక్వాకు సంబంధించిన పరిశ్రమలు తదితర హైరిస్క్ ఏరియాలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ సుజాత ఆదేశించారు. మండలంలోని జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హైరిస్క్ ఏరియాల్లో ఉంటున్న ప్రజలకు వ్యాక్సిన్‌లు, వైద్య సేవలు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు కిశోర్ కుమార్, బ్రహ్మేశ్వరనాయుడు, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, సూపర్‌వైజర్ సతీష్‌బాబు, ఫార్మసిస్ట్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రీసర్వేను పారదర్శకంగా చేపట్టాలి

కోవూరు : కోవూరు పంచాయతీలో తొలి విడతగా చేసే రీసర్వేను పారదర్శకంగా చేపట్టాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ అన్నారు. కోవూరు గుమ్మళ్లదిబ్బలో జరుగుతున్న రీసర్వేను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు పూర్తి సమాచారం ఇచ్చి రీసర్వే చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నిర్మలానందబాబా, రీసర్వే డీటీ మధుసూదన్‌రావు, సర్వేయర్ రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.

అంతా మా ఇష్టం

- నరసింహకొండ సమీపంలో మట్టి అక్రమ తవ్వకాలు
- రాత్రి వేళల్లో టిప్పర్లతో యథేచ్ఛగా రవాణా
- వాటి ధాటికి దెబ్బతిన్న కొమ్మరపూడి రోడ్డు
- టీడీపీ నేతల వ్యవహారంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం

కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి నెల్లూరు రూరల్ మండలంలో ఇసుక, మట్టి అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. స్థానిక టీడీపీ నేతల అండదండలతో కొందరు కాంట్రాక్టర్లు అంతా మా ఇష్టం అన్నట్లుగా అక్రమ తవ్వకాలకు తెగబడుతున్నారు. ఈ క్రమంలో నెల్లూరుకే తలమానికమైన నరసింహకొండకు సమీపంలోని భూములపై టీడీపీ నేతల కన్నుపడింది. అంతే ప్రతిరోజు రాత్రి 7 దాటిదంటే చాలు జేసీబీలతో మట్టి తవ్వకాలు, వాటి రవాణా జోరుగా చేపట్టారు. ఇలా తెల్లవారుజాము వరకు ఇష్టారాజ్యంగా మట్టిని మింగేస్తున్నారు. బహిర్గతంగా అక్రమ రవాణా జరుగుతున్నా రెవెన్యూ అధికారులు, పోలీసులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.



నరసింహకొండకు సమీపంలోని భూముల్లో అర్ధరాత్రి జేసీబీలతో మట్టి తవ్వకాలు

నెల్లూరు సిటీ : రూరల్ మండలంలోని నరసింహకొండకు సమీపంలోని కొమ్మరపూడి గ్రామం వద్ద కొంత ఆలయ భూములు, టీకేటీ భూములు ఉన్నాయి. ఆయా భూముల్లో రెండు నెలల క్రితం రాత్రి, పగలు అనే తేడా లేకుండా మట్టి తవ్వకాలు జరిపారు. ఇలా ప్రతిరోజు వందల సంఖ్యలో టిప్పర్‌లతో మట్టిని తరలించారు. అయితే దీనిపై సాక్షిలో 'మాది అధికార పార్టీ.. ఏమైనా చేస్తాం' అనే శీర్షికన కథనాన్ని ప్రచురించింది. దీంతో అధికారులు స్పందించి అక్రమ రవాణాను అడ్డుకున్నారు. అయితే గత వారం నుంచి తిరిగి అక్రమ రవాణాను పునఃప్రారంభించారు. రాత్రి 7 నుంచి తెల్లవారుజామున 4 గంటల వరకు జేసీబీల సాయంతో మట్టి తవ్వకాలు చేస్తున్నారు. ప్రతి రోజూ 50కి పైగా టిప్పర్‌లు, ట్రాక్టర్‌లతో రవాణా చేస్తున్నారు.

ఓ లేఅవుట్‌కు మట్టి తరలింపు..

నగరంలోని ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం నుంచి పొట్టేపాళేనికి వెళ్లే ప్రధాన రహదారిలో ఓ లేఅవుట్‌కు ఈ అక్రమ మట్టిని తరలిస్తున్నారు. ఇలా తరలించిన మట్టితో లేఅవుట్‌లో పనులు చేయిస్తున్నారు. అయితే సదరు లేఅవుట్ అక్రమంగా వేసినట్లు స్థానికులు చెబుతున్నారు. కొమ్మరపూడికి చెందిన ఓ టీడీపీ నేత అండదండలతో అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోందని తెలుస్తోంది.

అస్తవ్యస్తంగా రోడ్డు

ప్రతిరోజూ టిప్పర్లు, ట్రాక్టర్లతో వందలాది వాహనాల ద్వారా మట్టిని తరలిస్తుండడంతో కొమ్మరపూడి రోడ్డు అస్తవ్యస్తంగా తయారైంది. దీంతో వాహనదారులు ఆ మార్గంలో వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా ఈ టిప్పర్లు, ట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వెళ్తుండడంతో పలు సందర్భాల్లో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. టీడీపీ నేతలు తమ స్వార్థం కోసం మట్టి తవ్వకాలు చేయడం, బాగున్న రోడ్డును దెబ్బతీసేలా వాహనరాకపోకలు జరపడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చొరవ తీసుకుని టిప్పర్లు, ట్రాక్టర్లను అడ్డుకోవాలని కోరుతున్నారు.



వాహనాల రాకపోకల కారణంగా ధ్వంసమైన కొమ్మరపూడి రోడ్డు



అక్రమంగా తరలించిన మట్టిని ఓ లేఅవుట్‌లో గుట్టలుగా ఉంచిన వైనం

20న దేశవ్యాప్తంగా నిరసన

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా వామపక్షాల ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీన నిరసన ర్యాలీలను చేపడుతున్నామని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ అన్నారు. నగరంలోని బాలాజీనగర్‌లో ఉన్న జిల్లా సీపీఎం కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. కేంద్ర బడ్జెట్ పూర్తిగా కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా ఉందన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలు, వ్యవసాయ కూలీలు పూర్తి వ్యతిరేకంగా ఉందన్నారు. గ్రామీణ, పేద ప్రజలకు ఉపయోగపడే పథకాలకు బడ్జెట్‌లో నిధులను కేటాయించాలన్నారు. ఈ బడ్జెట్‌పై వామపక్షాల ఆధ్వర్యంలో 14న రౌండ్‌టేబుల్ సమావేశం ఉంటుందని, 20న నిరసన కార్యక్రమాలను చేపడుతున్నట్లు వివరించారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యదర్శి, వర్గ సభ్యుడు మాదాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచాలని, పట్టణ ప్రాంతాల్లోనూ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలన్నారు. సమావేశంలో డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరసింహ, రమణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులివ్వండి

నెల్లూరు(బారకాసు) : కార్పొరేషన్ పరిధిలో అపరిశుభ్రంగా ఉన్న ఖాళీ స్థలాలను గుర్తించి జంగిల్ క్లియరెన్స్ కోసం ఆయా స్థల యజమానులకు నోటీసులు ఇవ్వాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. స్థానిక 41వ డివిజన్ పరమేశ్వరి నగర్, రాజీవ్ గృహకల్ప పరిసర ప్రాంతాల్లో కమిషనర్ బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థలాల యజమాని ద్వారానే జంగిల్ క్లియరెన్స్ చేయించి ట్యాక్స్ విధించి వసూలు చేయాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. అన్ని డ్రెయినేజీ కాలువల్లో పూడికతీత, సిల్ట్ ఎత్తివేత పనులు నిరంతరం జరిగేలా పర్యవేక్షించాలన్నారు. ఆయన వెంట కార్పొరేటర్ విజయలక్ష్మి, ఎస్‌ఈ రామ్మోహన్‌రావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ చైతన్య, వెటర్నరీ వైద్యుడు డాక్టర్ మదన్ మోహన్, ఉద్యానశాఖ ఏడీ ప్రదీప్‌కుమార్ ఉన్నారు.



41వ డివిజన్‌లో ఖాళీ స్థలాలను పరిశీలిస్తున్న కమిషనర్ సూర్యతేజ

స్వచ్ఛాంధ్రపై అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న అదనపు కమిషనర్ నందన్



సమావేశానికి హాజరైన సచివాలయాల శానిటేషన్ కార్యదర్శులు

నెల్లూరు(బారకాసు) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న స్వచ్ఛాంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమంపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి, భాగస్వాములు చేయాలని ఎన్‌ఎంసీ అదనపు కమిషనర్ నందన్ సూచించారు. ఎన్‌ఎంసీ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ సమావేశ మందిరంలో పబ్లిక్ హెల్త్ విభాగం, వార్డు సచివాలయ శానిటేషన్ కార్యదర్శులతో సమీక్షా సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి, పొడి చెత్తను విడిగా సేకరించేలా పారిశుద్ధ్య సిబ్బందిని పర్యవేక్షించాలని సూచించారు. స్వచ్ఛ సంకల్ప సొసైటీ, మెప్మా ఇతర స్వచ్ఛంద సంస్థల ద్వారా అవగాహన సదస్సులను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. హోమ్ కంపోస్ట్ ద్వారా ఇళ్లలోనే ఎరువును తయారు చేసి చెట్లకు ఉపయోగించుకునే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పారిశుద్ధ్య వాహనాలు వ్యర్థాలను రోడ్లపై పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అన్ని డివిజన్లలో క్రమం తప్పకుండా కాలువల పూడికతీత, సిల్ట్ ఎత్తివేత పనులను చేపట్టేలా చూడాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేసే వారిని గుర్తించి జరిమానా విధించాలని సూచించారు.

ఉపాధి కూలీల సంఖ్యను పెంచండి

• డ్వామా పీడీ గంగా భవాని



టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డ్వామా పీడీ

నెల్లూరు (పొగతోట) : ఉపాధి హామీ పనులకు కూలీల సంఖ్యను పెంచేలా ప్రత్యేక దృష్టి సారించాలని డ్వామా పీడీ గంగా భవాని మండల సిబ్బందిని ఆదేశించారు. డ్వామా కార్యాలయం నుంచి వివిధ మండలాల ఏపీఓలు, ఈసీలు, టీఏలతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో పీడీ బుధవారం మాట్లాడారు. ప్రతిరోజూ లక్ష మంది కూలీలు ఉపాధి హామీ పనులకు హాజరయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. కూలీలు అధిక సంఖ్యలో హాజరయ్యే మండలాల్లో సిబ్బంది ప్రత్యేక చొరవ తీసుకుని కూలీల సంఖ్యను మరింత పెంచాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రతినిత్యం సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి కూలీలకు పనులు కల్పించాలన్నారు. ఈ శనివారం ఇంకుడు గుంతల నిర్మాణం భారీస్థాయిలో చేపట్టేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఇందుకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేసుకుని ఒక్కరోజులో సుమారు పదివేల ఇంకుడు గుంతల నిర్మాణం పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. దీనికి సంబంధించి పంచాయతీల వారీగా అనుమతులు మంజూరు చేయాలన్నారు. ఎక్కడా నిర్లక్ష్యం వహించకుండా ఇంకుడు గుంతల నిర్మాణాల ప్రక్రియను విజయవంతం చేయాలని తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నేతకు పరామర్శ

నెల్లూరు(బారకాసు) : రూరల్ నియోజకవర్గం, 33వ డివిజన్ వైఎస్సార్‌సీపీ నేత అశోక్‌కుమార్‌ను పార్టీ రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్ రెడ్డి బుధవారం పరామర్శించారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న అశోక్‌కుమార్‌ను ఆయన నివాసంలో కలిసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం చూసుకోవాలని సూచించారు. కార్పొరేటర్ సత్తార్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రావు శ్రీనివాసరావు(ఆర్ఎస్సార్), జిల్లా సెక్రటరీ ఆదిరెడ్డి, రూరల్ మైనార్టీ అధ్యక్షుడు అబ్దుల్‌రజాక్, ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు నవీన్‌రెడ్డి, మైనార్టీ నాయకుడు ఇక్బాల్, నారాయణరెడ్డి, అశోక్‌దాస్, జాకీర్, ముజాఫర్, చంద్రారెడ్డి, జుబేర్, విజయ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



అశోక్‌కుమార్‌ను పరామర్శిస్తున్న ఆనం విజయకుమార్‌రెడ్డి

కారుణ్య నియామకంపై హర్షం

నెల్లూరు(అర్బన్) : విశాఖలో హత్యకు గురైన తహసీల్దార్ రమణయ్య భార్య అనూషకు కారుణ్య నియామకం కింద ప్రభుత్వం ప్రొబేషనరీ డిప్యూటీ తహసీల్దార్‌గా ఉద్యోగం కల్పించినందుకు ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అల్లంపాటి పెంచలరెడ్డి, డానియల్ పీటర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఇందుకు కృషి చేసిన తమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లుకు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

18న పీసీసీ అధ్యక్షురాలి రాక

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల ఈనెల 18న నెల్లూరుకు రానున్నారు. నగరంలో నిర్వహించే ర్యాలీ, బహిరంగ సభలో ఆమె పాల్గొననున్నారు. ఈ మేరకు జిల్లా కాంగ్రెస్ పార్టీకి బుధవారం సమాచారం అందింది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని 33/11 కేవీ తెలుగుగంగ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని టౌన్ ఈఈ శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని శివాజీనగర్, ఎన్‌సీసీ కాలనీ, ఎన్‌బీటీ కాలనీ, డైకస్‌రోడ్డు పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నెల్లూరు సిటీ : రూరల్ నియోజకవర్గంలోని ములుమూడి, కొమ్మరపూడితో పాటు 22వ డివిజన్‌లలో పలు అభివృద్ధి పనులకు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి బుధవారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలు ఉండే ప్రాంతాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

డ్రగ్స్ అనర్థాలపై అవగాహన



మాట్లాడుతున్న సీఐ దశరథరామయ్య

నెల్లూరు (టౌన్) : స్థానిక వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ ఐటీఐలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో డ్రగ్స్ అనర్థాలపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. సంతపేట సీఐ దశరథరామయ్య హాజరై, డ్రగ్స్ వినియోగం వల్ల ఎలాంటి సమస్యలు వస్తాయో వివరించారు. డ్రగ్స్ వినియోగించినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి మహేంద్రరెడ్డి, ఐటీఐ ప్రిన్సిపల్ శ్రీధర్‌రెడ్డి, సర్వోదయ విశ్రాంత ప్రిన్సిపల్ నిర్మల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.